Follow: @ANNTELUGU
22-08-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 228 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## పెల్లెట్ గన్ గాయాలపై రాహుల్ ధర్నా


- ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయింపు
- బాధితుడితో కలిసి ఆందోళన

**ఢిల్లీ, మహా:** నీట్ నిరసనల్లో పోలీసుల బలప్రయోగంపై కాంగ్రెస్ ఆందోళన మరింత ఉధృతమైంది. జూలై 20న జరిగిన నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలకు గురైన యువకుడు సాహిల్ లోచబ్‌కు న్యాయం చేయాలంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద ఆకస్మిక ధర్నాకు దిగారు. బాధితుడితో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఆయన.. ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు.జూలై 20న నీట్ అంశంపై జరిగిన నిరసన సందర్భంగా పోలీసులు పెల్లెట్ గన్ ప్రయోగించడంతో తనకు గాయాలయ్యాయని సాహిల్ లోచబ్ ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని కాంగ్రెస్ ఆరోపించింది. బాధితుడి ఫిర్యాదును మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### సీఎం అమెరికా పర్యటన రద్దు వెనుక బీజేపీ కుట్ర

- తెలంగాణ పెట్టుబడులకు కేంద్రం అడ్డంకులు సృష్టిస్తోంది
- ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు



02

### రాయదుర్గం భూములకు రికార్డు ధర

- మే నెల రికార్డును అధిగమించిన పాన్మక్తా వేలం.




02

### వెండితెర 'షావుకారు' జానకి ఇకలేరు

- 94 ఏళ్ల వయసులో కన్నుమూత
- ఏడు దశాబ్దాల సినీ ప్రస్థానానికి ముగింపు



02

## సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు
# కేంద్రం రెడ్ సిగ్నల్
### తెలంగాణకు కేంద్రం మరో అవమానం

అవును నిరాకరించాం కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం

రాజకీయ కారణాలతోనే తిరస్కరించినట్లు వెల్లడి

అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై సీఎం రేవంత్ విస్మయం

**హైదరాబాద్, మహా :**
తెలంగాణకు కేంద్రం మరోషాకిచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు కేంద్రం రెడ్ సిగ్నల్ ఇచ్చింది. తెలుగురాష్ట్రాల చరిత్రలో ఇలాంటి సంఘటన జరగడం ఇదే ప్రథమం. బ్రిటన్ కు వెళ్ళనిచ్చిన కేంద్రం అమెరికా పర్యటనకు సీఎంకు అనుమతినివ్వకపోవడం తెలంగాణ ప్రజలను, ప్రభుత్వాన్ని అవమానించడమేనన్న చర్చ జరుగుతోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం ఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ మిగతా 2వ పేజీలో



### కత్తిపూడిలో కల్తీ కాటు

- ప్రాణాలతో యథేచ్ఛగా చెలగాటం
- పొద్దుతిరుగుడు నూనె ముసుగులో విడి నూనె.
- పల్లెలపై విషం చిమ్ముతున్న అక్రమార్కులు
- మన్యవాసులే లక్ష్యంగా నకిలీ దందా
- తుప్పు పట్టిన పీపాల్లో వంటనూనె
- నిద్రమత్తులో ఆహార భద్రతా అధికారులు

03

### ఎంపీ లింగమనేని కుమారుడు సంజూష్ అరెస్ట్

- రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలను ఖండించిన అధికారులు

02



## మంత్రివర్గం నుండి కొండాసురేఖ
# బర్తరఫ్?
### నేడో.. రేపో నిర్ణయం

- కాంగ్రెస్ నుండి సస్పెండ్ చేసే అవకాశం
- తీవ్ర ఆగ్రహంగా సీఎం, మంత్రులు, పార్టీ నేతలు
- చర్యలు తప్పవని.. సీఎం, హైకమాండ్ సంకేతాలు
- చిన్నారెడ్డి తీరుపైనా ఆగ్రహం.. ప్లానింగ్ బోర్డుపదవి నుండి తొలగించే అవకాశం

**హైదరాబాద్, మహా :**
రాష్ట్రముఖ్యమంత్రిపై నేరుగా ఆరోపణలుచేసిన కొండా ఫ్యామిలీ పొలిటికల్ చిక్కులు కొని తెచ్చుకుంది. మంత్రి కుమార్తె నేరుగా సీఎంపై తీవ్ర విమర్శలు చేసినా ఆ వ్యాఖ్యలకు తనకు సంబంధం లేదని కొండా సురేఖ వివరణ ఇవ్వడంపై హైకమాండ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పదవులు అనుభవిస్తూ.. తనపై నేరుగా ప్రతిపక్షాలు కూడా చేయని రీతిలో విమర్శలు చేయడంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీనేతలు తీవ్రస్థాయిలో భగ్గుమంటున్నారు. సొంతజిల్లాలో ఒక్క ఎమ్మెల్యే కూడా కొండా సురేఖకు మద్దతుగా లేకపోగా, దేవాదాయ శాఖ, అటవీశాఖలో ఆమె పనితీరు వివాదాస్పదమైంది. కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీకి పెద్ద తలనొప్పులు తేగా, ఒక దశలో సోనియాగాంధీకి కూడా నేరుగా ఫిర్యాదులు వెళ్ళాయి. ఆ సమయంలో ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ ఆమెను వెనుకేసుకొచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై, ఎంపీ వేం నరేందర్ రెడ్డిపై కొండా ఫ్యామిలీ మిగతా 2వ పేజీలో






## మంత్రి కొండా సురేఖపై
# తిరుగుబాటు
### భర్తరఫ్ చేయాలన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

- కూతురు సుష్మితా పటేల్ వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదని నిలదీత
- సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తే సంహించేది లేదని స్పష్టం
- సీఎల్పీలో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**హైదరాబాద్, మహా :**
సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత బహిరంగంగా చేసిన వ్యాఖ్యలను మంత్రి కొండా సురేఖ ఖండించకపోవడంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వంత కూతురు సుష్మిత సీఎంపై లేని పోని వ్యాఖ్యలు చేసినప్పటికీ మంత్రిగా కొండా సురేఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని వారు నిలదీశారు. సుష్మిత వ్యాఖ్యలను తామంతా తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. మంత్రి కొండా సురేఖ తన కుమార్తె సుస్మిత మాట్లాడిన మాటలను ఖండించాలని డిమాండ్ చేశారు. ఏదైనా సమస్య ఉంటే సీఎల్పీ సమావేశం, పీసీసీ సమావేశంలో మాట్లాడాలని సూచించారు. సీఎంపై ఎవరు తప్పుడు ఆరోపణలు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సొంత పార్టీలో ఉండే నేతలు, సీఎం నిర్ణయాన్ని తప్పుపట్టడం సరికాదన్నారు. సీఎల్పీలో మంత్రి కొండా సురేఖ వివాదంపై నిర్వహించిన ప్రెస్‌మీట్ లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాట్లాడారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్‌లు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యేలు

మిగతా 2వ పేజీలో

### జనసేన తెలంగాణ అధికార ప్రతినిధిగా గడల



- గతంలో తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గా పని చేసిన గడల శ్రీనివాస్
- కీలక పదవిని అప్పగించిన పవన్ కల్యాణ్ కు ధన్యవాదాలు తెలిపిన శ్రీనివాస్
- పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని వెల్లడి

03



## మంత్రి కొండా సురేఖపై
# తిరుగుబాటు

**( మొదటి పేజీ తరువాయి )**
నాయిని రాజేందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మధుసూదన్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కూచుకుళ్ల రాకేశ్ రెడ్డి, బాలు నాయక్, రేవూరి ప్రకాశ్ రెడ్డి, వంశీ కృష్ణ, వీర్లపల్లి శంకర్, వెడ్మ బొజ్జు, బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేల్, కుందూరు జైవీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి సొంత పార్టీ నేతలు అండగా ఉండాలని అంతేకాని, విమర్శించడం సరికాదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. చెట్టు కింద ఉండి చెట్టుకొమ్మనే నరుక్కొనే వైఖరి సరికాదన్నారు. కొండా సుస్మిత వ్యాఖ్యలు ప్రతిపక్షాలకు బలం ఇచ్చినట్లు అవుతుందన్నారు. సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ చెప్పడం ఆమోద యోగ్యం కాదని, సుస్మిత వ్యాఖ్యలతో సంబంధం లేకుంటే కొండా సురేఖ ఖండించాలని వారంతా డిమాండ్ చేశారు. మంత్రి కుమార్తె చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం మూల్యం చెల్లిస్తుంటే, మీరు మాత్రం ఎంజాయ్ చేస్తున్నారని మండిపడ్డారు. వారి భాష ప్రతిసారీ పార్టీకి తలనొప్పిగా మారుతుందని, కొండా సురేఖ గతంలోనూ నోరుజారి పార్టీకి ఇబ్బంది తెచ్చారని గుర్తు చేశారు. ఇలా మాట్లాడే వారిపై ఏఐసీసీ కఠిన నిర్ణయాలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని కోరారు.

10 రాక్షస పాలనను అంతమొందించి రాష్ట్రంలో కాంగ్రెస్ ను అధికారంలోకి వచ్చేందుకు రేవంత్ రెడ్డి ఎంతో పడ్డారని గుర్తు చేశారు. సీఎంపై అనవసర ఆరోపణలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీకి తలనొప్పిగా మారిన వ్యక్తులను పదవుల నుంచి తప్పించాలని కోరారు. బజారుకు వచ్చి మాట్లాడటం కాంగ్రెస్ సంస్కృతి కాదని మండిపడ్డారు. సీఎంకు బహిరంగ క్షమాపణ చెప్పకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సుస్మిత వ్యాఖ్యలను గ్రామీణ స్థాయి కార్యకర్తలు కూడా అసహ్యించుకుంటున్నారని ధ్వజమెత్తారు. సీఎంను బలహీనపరచాలనే ప్రతిపక్షాల కుట్రను వీరు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం, ప్రభుత్వాన్ని బలహీనపరిచే వారిపై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి వాళ్లు ఎన్ని కుట్రలు చేసినా, ప్రజలు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తున్నారని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించిన వారికి షోకాజ్ నోటీసు ఇచ్చి సరిపెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాల్లో కొండా సురేఖ భాగం, మరి ఆ నిర్ణయాలను ఆమె కుమార్తెనే విమర్శిస్తుంటే ఖండించరా? అని నేతలు ప్రశ్నించారు. మంత్రి సురేఖను వెంటనే బర్తరఫ్ చేయాలని వారు పార్టీ అధిష్టానాన్ని కోరారు. ప్రతిపక్షాలకు అస్త్రాలు అందించేలా కొండా సుస్మిత వ్యాఖ్యలున్నాయని, ఇది సరికాదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. విచ్చలవిడిగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నాలుగు పార్టీలు తిరిగొచ్చినోళ్లు ఒరిజినల్ కాంగ్రెస్ అంటున్నారని ఎద్దేవా చేశారు. వారు ఏ పార్టీలో సక్రమంగా లేరని గుర్తు చేశారు. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్‌లోకి వెళ్లి మళ్లీ కాంగ్రెస్‌కు వచ్చారన్నారు. రేవంత్ ను తామే సీఎం చేశామని తుపాకీ రాముడిలా మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎంపీ ఎన్నికల్లో వరంగల్‌లో 12 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ వచ్చిందని, ఒక్క సురేఖ నియోజకవర్గంలోనే కాంగ్రెస్‌కు మెజార్టీ రాలేదన్నారు. తమ పార్టీలోనే కొందరు గుంటనక్కలు ఉండి వీళ్లను నడిపిస్తున్నారని మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తప్పించాలని డిమాండ్ చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఆమెవి కాదని, అవి కొండా సురేఖ మాటలేనని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు విమర్శించారు. సుస్మిత ఇలాంటి మాటలు మాట్లాడటం ఇదే తొలిసారి కాదన్న ఆయన కాంగ్రెస్‌లోనే ఉంటూ పార్టీనే ఖతం చేయాలని చూడటం సరికాదని అన్నారు. అటవీశాఖ మంత్రిగా కొండా సురేఖ తన శాఖపై ఎన్ని రివ్యూలు చేశారని ప్రశ్నించారు. పార్టీలో ఎవరు తప్పు చేసినా ఏఐసీసీ చర్యలు తీసుకోవాలని, బహిరంగంగా మాట్లాడే వారిపై చర్యలు తీసుకోకుంటే పార్టీ నష్టపోతుందని అన్నారు.

## మంత్రివర్గం నుండి
# కొండాసురేఖ బర్తరఫ్?

**( మొదటి పేజీ తరువాయి )**
బహిరంగంగా అనేకసార్లు విమర్శలు చేయగా, పలువురు మంత్రులు మధ్యవర్తిత్వం చేయడంతో మెత్తపడ్డారు. ఈసారి అలాంటి లైఫ్ లైన్ లు ఏవీలేవని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 23న రావడంతోనే బర్తరఫ్ ఖాయమన్న చర్చ జరుగుతోంది. శుక్రవారం 20మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రెస్ మీట్ పెట్టి కొండాసురేఖను మంత్రివర్గం నుండి తప్పించాలని, కొండా ఫ్యామిలీని కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించాలని కోరింది. సీఎల్పీలో ఈమేరకు తీర్మానం కూడా చేశారు. కొండా స్థానంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య లేదా రామచంద్రనాయక్ కు ఛాన్స్ దక్కే అవకాశం కనబడుతోంది. గతంలో కొండా సురేఖ పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ వంటి నేతలు సానుకూలంగా ఉండగా, ఇపుడు నేరుగా ముఖ్యమంత్రిని, మంత్రులను దూషించడంతో ఎవరూ జోక్యం చేసుకోవడానికి సిద్ధంగా లేనట్లు కనబడుతోంది.

**చిన్నారెడ్డిపై కూడా**
చిన్నారెడ్డికి ప్లానింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ పదవినిచ్చినా, గౌరవానికి భంగం లేకుండా వ్యవహరించినా అసమ్మతి రాజకీయాలు చేస్తున్నారని ముఖ్యమంత్రి, పార్టీనేతలు ఆగ్రహంగా ఉన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి నేరుగా పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గేను కలిసి ఫిర్యాదుచేయగా, చిన్నారెడ్డి వర్గీయులు గాంధీభవన్ ను ముట్టడించారు. పార్టీపరమైన అంశం ఎలా ఉన్నా ప్రభుత్వపదవుల్లో ఉన్న వారు బాధ్యతగా ఉండాలన్న సంకేతం పంపేందుకు ప్లానింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ పదవినుండి తప్పించే అవకాశం ఉంది.

# రాయదుర్గం భూములకు రికార్డు ధర

**ఎకరం రూ.264 కోట్లు**
**మే నెల రికార్డును అధిగమించిన పాన్మక్తా వేలం.**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ రాయదుర్గం ప్రాంతంలోని భూముల ధరలు మరోసారి రికార్డు స్థాయికి చేరాయి. పాన్మక్తాలోని సర్వే నంబర్ 83/1లో ఉన్న 5.25 ఎకరాల భూమికి తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ నిర్వహించిన వేలంలో ఎకరానికి ఏకంగా రూ.264 కోట్ల ధర పలికింది. దీంతో హైదరాబాద్ భూముల మార్కెట్ లో మరో కొత్త రికార్డు నమోదైంది.

ఇదే సర్వే నంబర్‌లో మే నెలలో నిర్వహించిన వేలంలో ఎకరానికి రూ.237 కోట్ల ధర పలికింది. తాజాగా జరిగిన వేలంలో ఆ ధరను అధిగమిస్తూ ఎకరానికి రూ.264 కోట్లు పలకడం విశేషం. అంటే గత వేలంతో పోలిస్తే ఎకరానికి రూ.27 కోట్ల మేర ధర పెరిగింది.

**5.25 ఎకరాలకు భారీ డిమాండ్**
పాన్మక్తాలోని 5.25 ఎకరాల భూములకు జరిగిన వేలంలో పెట్టుబడిదారుల నుంచి గట్టి స్పందన లభించింది. హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన ప్రాంతాల్లో రాయదుర్గం ఒకటిగా మారడం, ఐటీ సంస్థలు, అంతర్జాతీయ కంపెనీల కార్యాలయాలు, వాణిజ్య కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తుండటంతో ఈ ప్రాంత భూములకు భారీ డిమాండ్ కొనసాగుతోంది.
ప్రధాన రహదారులు, మెట్రో, ఐటీ కారిడార్, గచ్చిబౌలి-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు సమీపంలో ఉండటం కూడా భూముల విలువ పెరగడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

**తగ్గని హైదరాబాద్ రియల్ ఎస్టేట్ జోరు**
రాయదుర్గం, పాన్మక్తా ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల వేలానికి లభిస్తున్న స్పందన హైదరాబాద్‌లో ఉన్న భారీ పెట్టుబడి సామర్థ్యాన్ని మరోసారి చాటుతోంది. ఎకరం ధర రూ.264 కోట్లకు చేరడం ద్వారా అత్యంత విలువైన వాణిజ్య భూముల విషయంలో హైదరాబాద్ దేశంలోని ప్రముఖ నగరాలతో పోటీ పడుతున్న పరిస్థితి స్పష్టమవుతోంది. మే నెలలో నమోదైన రూ.237 కోట్ల రికార్డును కేవలం కొన్ని నెలల్లోనే అధిగమించడం ద్వారా రాయదుర్గం భూములకు ఉన్న డిమాండ్ ఏ స్థాయిలో ఉందో తాజా వేలం వెల్లడించింది.

# ఎంపీ లింగమనేని కుమారుడు సంజూష్ అరెస్ట్

**రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలను ఖండించిన అధికారులు**

**హైదరాబాద్, మహా :** మాదాపూర్‌లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం కేసులో జనసేన ఎంపీ లింగమనేని రమేశ్ కుమారుడు లింగమనేని సంజూష్ (21)ను ఇంకా అరెస్టు చేయకపోవడంపై సైబరాబాద్ పోలీసులు వివరణ ఇచ్చారు. తాము నిబంధనల ప్రకారమే వ్యవహరించామని, ఈ విషయంలో ఎవరి పలుకుబడికి లొంగలేదని వారు స్పష్టం చేశారు. ఆగస్టు 16న మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ సమీపంలో రోడ్డు దాటుతున్న భారతి ముఖి (26) అనే యువతిని సంజూష్ నడుపుతున్న ఆస్టన్ మార్టిన్ కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతురాలు భారతి ఒక లైఫ్‌స్టైల్ స్టోర్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 106(1) (నిర్లక్ష్యం కారణంగా మరణం సంభవించడం) కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో గరిష్ట శిక్ష ఐదేళ్లు మాత్రమేనని, ఏడేళ్లలోపు శిక్ష పడే నేరాల్లో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదని సైబరాబాద్ డీసీపీ రితిరాజ్ తెలిపారు. సుప్రీం కోర్టు "అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్" కేసులో ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 35 కింద నిందితుడికి నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. దర్యాప్తునకు సహకరించాలని ఆ నోటీసులో పేర్కొన్నట్లు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే సంజూష్‌ను అదుపులోకి తీసుకుని ఆల్కహాల్, డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా ఫలితాలు నెగటివ్‌గా వచ్చాయని, తదుపరి నిర్ధారణ కోసం రక్త నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడి రాజకీయ నేపథ్యం కారణంగానే పోలీసులు అరెస్ట్ చేయలేదని వస్తున్న ఆరోపణలను పోలీసులు ఖండించారు. అవి కేవలం నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేశారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని, ఫోరెన్సిక్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నివేదికలు అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనల మేరకు అవసరమైతే అరెస్ట్ చేసే అంశాన్ని పరిశీలిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు
# కేంద్రం రెడ్ సిగ్నల్

**( మొదటి పేజీ తరువాయి )**
కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం కోసం ఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం.. ఆగస్టు 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించనుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై ఈ బృందం చర్చించాలని నిర్ణయించింది. సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వ లేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది. భారతదేశ వ్యతిరేకశక్తులతో రేవంత్ చేతులు కలపబోతున్నట్లు బీజేపీ ఎంపీలు ఆరోపించడం, కేంద్రప్రభుత్వం దీనికి అనుమతి నిరాకరించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. దేశవ్యాప్తంగా దీనిపై చర్చ జరుగుతోంది.



**రాజకీయ కారణాలతో నిరాకరించడం విస్మయం'**
అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ పురోగతి, యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాల కల్పనతో పాటు దేశ అభివృద్ధికి దోహదపడే లక్ష్యంతో ఈ పర్యటనను రూపొందించామని ఆయన పేర్కొన్నారు. రాజకీయ కారణాలతో పర్యటనకు అనుమతి నిరాకరించడం విచారకరమని అన్నారు. అయితే కేంద్ర నిర్ణయాన్ని గౌరవిస్తామని, యూకే పర్యటనను కొనసాగించి అక్కడి కార్యక్రమాలను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అమెరికాలోని బోస్టన్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను మాత్రం రద్దు చేశారు.

**'ప్రపంచ స్థాయి విద్యను హైదరాబాద్‌కు తీసుకురావాలి'**
అమెరికా పర్యటన ప్రధాన ఉద్దేశం ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలను తెలంగాణకు తీసుకురావడమేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానానికి అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పరచుకోవాలని భావించామని చెప్పారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలన్న తెలంగాణ యువత ఆకాంక్షలకు ఈ భాగస్వామ్యాలు సమాధానంగా నిలిచేవని పేర్కొన్నారు. ''దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయానికి వస్తే రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా అందరూ ఆలోచించాలి'' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**అధికారులకు కీలక ఆదేశాలు**
అమెరికా పర్యటన రద్దయినప్పటికీ అక్కడి విశ్వవిద్యాలయాలతో ఇప్పటికే ప్రారంభమైన చర్చలను నిలిపివేయరాదని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వివిధ విశ్వవిద్యాలయాలతో కొనసాగుతున్న సంప్రదింపులను అధికారులు ముందుకు తీసుకెళ్లాలని, అవసరమైన అవగాహన ఒప్పందాలు, భాగస్వామ్య ఒప్పందాలను పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణలో విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జ్ఞాన, నైపుణ్య కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ వంటి విద్యాసంస్థలు నగరాన్ని అత్యుత్తమ మానవ వనరుల కేంద్రంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాయని అన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నుంచి ప్రపంచస్థాయి సాంకేతిక నాయకులు ఎదిగారని, ఐఐటీ, ఐఎస్‌బీ, ఐఐఐటీ, నల్సార్ వంటి సంస్థలతో నగరం అంతర్జాతీయ సంస్థలను, ప్రపంచస్థాయి సామర్థ్య కేంద్రాలను ఆకర్షించగలిగిందని పేర్కొన్నారు. ఇకపై ప్రపంచంలోని ప్రముఖ విద్య, నైపుణ్య సంస్థలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చి 21వ శతాబ్దపు తెలంగాణ అభివృద్ధికి అవసరమైన మానవ వనరులను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సాధారణ భారతీయ విద్యార్థి హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ బిజినెస్ స్కూల్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రపంచస్థాయి సంస్థలతో అనుసంధానమై విద్య, శిక్షణ, ధ్రువపత్రాలు పొందే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. ''చాలామంది నాయకులు తమ పిల్లలను విదేశాలకు పంపాలని కోరుకున్నారు. కానీ ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను భారత్‌కు తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అమెరికా పర్యటనకు కేంద్ర అనుమతి నిరాకరణతో రాజకీయంగా వివాదం చెలరేగినప్పటికీ.. యూకే పర్యటన ద్వారా విద్య, నైపుణ్యాలు, క్రీడలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై తెలంగాణ ప్రభుత్వం తన ప్రయత్నాలను కొనసాగించనుంది.

# పెల్లెట్ గన్ గాయాలపై రాహుల్ ధర్నా

**( మొదటి పేజీ తరువాయి )**
పోలీసులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ రాహుల్ గాంధీ నేరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



**బాధితుడితో కలిసి పోలీస్‌స్టేషన్‌కు**
సాహిల్ లోచబ్‌తో కలిసి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న రాహుల్ గాంధీ.. ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు స్వీకరించినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పోలీసులు నిరాకరిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.
పోలీసుల తీరును నిరసిస్తూ రాహుల్ గాంధీ పోలీస్‌స్టేషన్ బయటే బైఠాయించారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు, ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

**ఆందోళనలో ప్రియాంకా గాంధీ**
రాహుల్ గాంధీ చేపట్టిన ధర్నాలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కూడా పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కాంగ్రెస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, నీట్ నిరసనల్లో పోలీసులు అతిగా బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై ఇప్పటికే సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసిన నేపథ్యంలో తాజా ధర్నాకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. పోలీసుల చర్యలు, నిరసనకారులకు గాయాలు, బలప్రయోగం నిబంధనలకు అనుగుణంగా జరిగిందా అనే అంశాలను ఆ కమిటీ పరిశీలించనుంది. తాజా ధర్నాతో నీట్ నిరసనల వ్యవహారం మరోసారి జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# సీఎం వచ్చాక మాట్లాడతా

**తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తా**
**క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చా**
**మంత్రి కొండా సురేఖ**

**హైదరాబాద్, మహా :** తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ మరోసారి స్పందించారు. ఈ విషయంపై తాను చెప్పాల్సింది ఇప్పటికే క్రమశిక్షణ కమిటీకి వివరించానని, ప్రస్తుతం మీడియా ముందు మాట్లాడేదేమీ లేదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత అన్ని విషయాలపై స్పందిస్తానని ఆమె తెలిపారు. వరంగల్ జిల్లా గీసుకొండలో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన విమర్శలపై పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై సురేఖ ఇప్పటికే కమిటీకి లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. తన కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని, వాటికి తనను బాధ్యురాలిని చేయవద్దని ఆమె ఆ లేఖలో కోరినట్లు సమాచారం. అయితే, ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అంతర్గత వర్గాల్లో ఈ అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. కేవలం నోటీసులతోనే సరిపెట్టకుండా, క్రమశిక్షణా చర్యలు మరింత కఠినంగా ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సీఎల్పీలో భేటీ అయి మంత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించాలని, లేకపోతే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి వచ్చిన తర్వాత ఈ వివాదంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# ఎమ్మెల్యేలకు ఉచిత కార్ల ఆఫర్
## తిరస్కరించిన డీఎంకే

**చెన్నై, మహా :** తమిళనాడు రాజకీయాల్లో ఉచిత వాహనాల పంపిణీ అంశం తీవ్ర దుమారం రేపుతోంది. రాష్ట్రంలోని శాసనసభ్యులందరికీ ఉచితంగా అధికారిక వాహనాలు అందజేస్తామని ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రకటించిన కొన్ని రోజులకే, ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే ఈ ఆఫర్‌ను తీవ్రంగా వ్యతిరేకించింది. రాష్ట్రం తీవ్ర ఆర్థిక లోటు, అప్పుల్లో కూరుకుపోయిన వేళ ప్రజాధనాన్ని ఇలా దుర్వినియోగం చేయడం తగదని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంపై తమిళనాడు శాసనసభలో తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. శాసనసభ ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అసెంబ్లీలో మాట్లాడుతూ, డీఎంకేకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు ఎవరూ ఈ ఉచిత కార్లను తీసుకోకూడదని నిర్ణయించినట్లు వెల్లడించారు. "టీవీకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే రాష్ట్రం తీవ్ర అప్పుల్లో ఉందని చెబుతోంది. అలాంటప్పుడు ఇలాంటి ఉచిత ఆఫర్లు ఇవ్వడం సరైంది కాదు. ఎమ్మెల్యేలకు కార్లు ఇచ్చే ముందు వారి ఎన్నికల అఫిడవిట్లను పరిశీలించాలి. వారికి ఇప్పటికే సొంత కార్లు ఉన్నాయా లేదా, వారి ఆర్థిక పరిస్థితి ఏమిటనేది తనిఖీ చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి" అని ఉదయనిధి డిమాండ్ చేశారు. ఉచితాలను వ్యతిరేకిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ప్రజాధనంతో విలాసాలకు స్వస్తి పలకాలని ఎండగట్టారు.


**సమానత్వంతోనే నిర్ణయం: టీవీకే సమర్థన**
డీఎంకే విమర్శలపై టీవీకే మంత్రి అధవ్ అర్జున ఘాటుగా స్పందించారు. శాసనసభ్యులందరినీ సమానంగా చూడాలనే ఆలోచనతోనే ముఖ్యమంత్రి విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. వీసీకే, కమ్యూనిస్ట్ పార్టీల వంటి చిన్న పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యేల ఆర్థిక పరిస్థితి అంతగా బాగులేదని, నియోజకవర్గాల్లో పర్యటించడానికి కార్లు విలాసం కాదని, అదొక ప్రాథమిక అవసరమని వివరించారు. ఇదే క్రమంలో ఉదయనిధి స్టాలిన్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తూ, "మూడు బంగ్లాలు ఉన్నప్పటికీ ఆయన ఎందుకు ప్రభుత్వ బంగ్లాలో ఉంటున్నారు?" అని ప్రశ్నించారు. దీనిపై సీనియర్ డీఎంకే నేత కె.ఎన్. నెహ్రూ జోక్యం చేసుకుని, కేబినెట్ హోదా ఉన్న ప్రతిపక్ష నేత అధికారిక నివాసంలో ఉండటం నియమబద్ధమేనని స్పష్టం చేశారు.



# సీఎం అమెరికా పర్యటన రద్దు వెనుక బీజేపీ కుట్ర

**ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు**

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడం వెనుక బీజేపీ నేతల కుట్రలు ఉన్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనే "వికసిత్ భారత్" లో తెలంగాణ రాష్ట్రం ఉండొద్దనే కుట్రలు ఉన్నాయని తమకు అర్థం అవుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు కోసం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్న తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని విహెచ్ ఆరోపించారు. మెజారిటీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జనాభా దామాషాలో న్యాయం జరగాలన్న రాహుల్ గాంధీ లక్ష్యం కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కేంద్రం చేపట్టే జనగణన గణాంకాల్లో ఓబీసీ జనాభా లెక్కలు చూపకుండా బీజేపీ మోకా లడ్డుతుందని విహెచ్ విమర్శించారు. సీడబ్ల్యూసీలో నిర్ణయం తీసుకున్న ప్రకారం ఈ నెల 25వ తేదీన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఓబీసీ మహాసభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



# ఎంపీ లింగమనేని కుమారుడు సంజూష్ అరెస్ట్

**రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలను ఖండించిన అధికారులు**

**హైదరాబాద్, మహా :** మాదాపూర్‌లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం కేసులో జనసేన ఎంపీ లింగమనేని రమేశ్ కుమారుడు లింగమనేని సంజూష్ (21)ను ఇంకా అరెస్టు చేయకపోవడంపై సైబరాబాద్ పోలీసులు వివరణ ఇచ్చారు. తాము నిబంధనల ప్రకారమే వ్యవహరించామని, ఈ విషయంలో ఎవరి పలుకుబడికి లొంగలేదని వారు స్పష్టం చేశారు. ఆగస్టు 16న మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ సమీపంలో రోడ్డు దాటుతున్న భారతి ముఖి (26) అనే యువతిని సంజూష్ నడుపుతున్న ఆస్టన్ మార్టిన్ కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతురాలు భారతి ఒక లైఫ్‌స్టైల్ స్టోర్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 106(1) (నిర్లక్ష్యం కారణంగా మరణం సంభవించడం) కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో గరిష్ట శిక్ష ఐదేళ్లు మాత్రమేనని, ఏడేళ్లలోపు శిక్ష పడే నేరాల్లో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదని సైబరాబాద్ డీసీపీ రితిరాజ్ తెలిపారు. సుప్రీంకోర్టు "అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్" కేసులో ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 35 కింద నిందితుడికి నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. దర్యాప్తునకు సహకరించాలని ఆ నోటీసులో పేర్కొన్నట్లు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే సంజూష్‌ను అదుపులోకి తీసుకుని ఆల్కహాల్, డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా ఫలితాలు నెగటివ్‌గా వచ్చాయని, తదుపరి నిర్ధారణ కోసం రక్త నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడి రాజకీయ నేపథ్యం కారణంగానే పోలీసులు అరెస్ట్ చేయలేదని వస్తున్న ఆరోపణలను పోలీసులు ఖండించారు. అవి కేవలం నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేశారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని, ఫోరెన్సిక్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నివేదికలు అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనల మేరకు అవసరమైతే అరెస్ట్ చేసే అంశాన్ని పరిశీలిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# జనసేన తెలంగాణ అధికార ప్రతినిధిగా గడల

- గతంలో తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గా పని చేసిన గడల శ్రీనివాస్
- కీలక పదవిని అప్పగించిన పవన్ కల్యాణ్ కు ధన్యవాదాలు తెలిపిన శ్రీనివాస్
- పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని వెల్లడి



హైదరాబాద్, మహా : జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు జనసేన పార్టీ నాయకత్వం అధికారిక ప్రకటన చేసింది. ఈ నియామకంపై శ్రీనివాసరావు స్పందిస్తూ... తనపై ప్రత్యేక నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ బాధ్యతను ఎంతో వినమ్రతతో, నిబద్ధతతో స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ప్రజా సమస్యలపై జనసేన వైఖరిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజాసేవే తన ప్రథమ లక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణకు, బలోపేతానికి నిరంతరం శ్రమిస్తూ, క్షేత్రస్థాయి ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చి.. పార్టీకిప్రజలకు మధ్య బలమైన వారధిగా నిలుస్తానని చెప్పారు. ఈ నియామకానికి సహకరించిన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరికి, సీనియర్ నాయకత్వానికి, తనకు అండగా నిలుస్తున్న జనసైనికులు, వీర మహిళలు, పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# కబ్జాకోరులకు మల్కాజ్‌గిరి సీపీ షాక్

- వృద్ధురాలికి దక్కిన రూ.40 కోట్ల భూమి
- మల్కాజ్‌గిరి సీపీ సుమతిని ఆశ్రయించిన వృద్ధురాలు
- రాజకీయ ఒత్తిళ్లను కాదని వృద్ధురాలికి న్యాయం చేసిన సీపీ
- భూ కబ్జాకు యత్నించిన వారిపై చర్యలకు పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్, మహా :** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 80 ఏళ్ల ఓ వృద్ధురాలు భూకబ్జాదారుల చెర నుంచి తన రూ. 40 కోట్ల విలువైన ఆస్తిని దక్కించుకున్నారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి చొరవతో ఆమెకు సకాలంలో న్యాయం చేకూరింది. రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్కచేయకుండా నిందితులపై కఠినంగా వ్యవహరించి, వృద్ధురాలికి బాసటగా నిలిచిన సీపీపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన సదరు మహిళకు సుమారు రూ. 40 కోట్ల విలువైన ఖాళీ స్థలం ఉంది. దశాబ్దాలుగా ఆ భూమి ఆమె స్వాధీనంలోనే ఉన్నప్పటికీ, ఇటీవల కొందరు భూకబ్జాదారులు ఆ ఆస్తిపై కన్నేశారు. అక్రమంగా స్థలంలోకి చొరబడి, అది తమదేనంటూ సదరు వృద్ధురాలిని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో బాధిత మహిళ ధైర్యంతో మల్కాజ్‌గిరి సీపీ సుమతిని ఆశ్రయించారు. తన భూమికి సంబంధించిన అన్ని దస్తావేజులను సమర్పించి, న్యాయం చేయాలని అభ్యర్థించారు. వృద్ధురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన సీపీ సమగ్ర విచారణకు ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, ఆ భూమి బాధితురాలిదేనని ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల ద్వారా కబ్జాదారులు ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయినప్పటికీ సీపీ ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా, ఆ స్థలం తమదేనని వాదిస్తున్న వారిని పిలిపించి ఆధారాలు సమర్పించాలని ఆదేశించారు. వారు సరైన పత్రాలను చూపలేకపోవడంతో, ఆ భూమి వృద్ధురాలిదేనని అధికారులు తుది నిర్ధారణకు వచ్చారు. కోట్లాది రూపాయల విలువైన తన ఆస్తి తిరిగి దక్కడంతో ఆ వృద్ధురాలు హర్షం వ్యక్తం చేశారు. సీపీ సుమతి ప్రదర్శించిన చొరవను, వృత్తిపరమైన నిబద్ధతను స్థానికులు కొనియాడుతున్నారు. భూకబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# ఉచిత పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పెరుగుతోంది
- పన్నుల ఆదాయాన్ని ఉచితాలకు వినియోగించడం సరికాదు



**హైదరాబాద్, మహా:** సంక్షేమ పథకాల పేరుతో ఉచిత ప్రయోజనాలు అందించడం వల్ల ప్రభుత్వ ఖజానాపై పడుతున్న ఆర్థిక భారంపై తెలంగాణ హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. పింఛన్లు, ఇతర ప్రయోజనాల చెల్లింపులు జరగడం లేదంటూ పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు సైతం న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని పేర్కొంది. ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో న్యాయస్థానాలు నేరుగా జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసినప్పటికీ.. పన్నుల రూపంలో సమకూరే ఆదాయాన్ని ఉచిత పథకాలకు మళ్లించడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించింది.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చట్టబద్ధతను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టులో మరోసారి విచారణ జరిగింది. జస్టిస్ ఎన్.వి. శ్రవణ్‌కుమార్ ఈ పిటిషన్‌ను విచారించారు.

**అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తారా?**

ప్రభుత్వం అప్పులు చేసి సంక్షేమ పథకాలను కొనసాగించాలని భావిస్తోందా? అని ధర్మాసనం ప్రశ్నించింది. వివిధ చెల్లింపులకు నిధుల కొరత ఉందని గతంలో కోర్టుకు హాజరైన అధికారులు పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది.ప్రభుత్వ రంగ సంస్థలను సమర్థంగా నిర్వహించి వాటిని లాభదాయకంగా మార్చగలిగితే, ఆ ఆదాయాన్ని సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించే అవకాశం ఉంటుందని న్యాయస్థానం సూచించింది. తాము ఏ రాజకీయ పార్టీని, ప్రభుత్వ విధానాన్ని విమర్శించడం లేదని స్పష్టం చేసింది. 2014 నుంచి కల్యాణలక్ష్మి పథకంపై చేసిన వ్యయం, ఆర్థిక ప్రభావానికి సంబంధించిన వివరాలను మాత్రమే కోరుతున్నామని పేర్కొంది.

**బాల్య వివాహాల నిర్మూలన కోసమే..**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను బాల్య వివాహాలను అరికట్టే లక్ష్యంతో అమలు చేస్తున్నామని ప్రభుత్వ తరఫు అదనపు న్యాయవాది మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ ధర్మాసనానికి వివరించారు. ఈ పథకాలకు బడ్జెట్ లో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు.ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే తరహా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులకు శాసనసభ ఆమోదం ఉంటుందని, ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

**2014 నుంచి వ్యయ వివరాలు ఇవ్వాలి**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి జారీ చేసిన ఎనిమిది ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ వ్యక్తిగత హోదాలో పిటిషన్ దాఖలు చేశారు. చట్టపరమైన అనుమతి లేకుండా ప్రభుత్వ సమీకృత నిధి నుంచి డబ్బులు ఖర్చు చేయడం సరికాదని ఆయన తరఫు న్యాయవాది వాదించారు.పథకాల అమలుకు కేవలం ప్రభుత్వ ఉత్తర్వులు, ఆర్థిక శాఖ అనుమతులు సరిపోతాయా? వాటికి చట్టపరమైన ఆధారం ఏమిటి? అని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

**సమగ్ర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలి**

ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో పూర్తి వివరాలు లేవని హైకోర్టు తప్పుపట్టింది. అందులో రాజ్యాంగంలోని 162వ అధికరణను ఎందుకు ప్రస్తావించారని ప్రశ్నించింది. సంబంధం లేని అధికరణను పొరపాటున అఫిడవిట్‌లో చేర్చినట్లు ప్రభుత్వ తరఫు న్యాయవాది అంగీకరించారు.దీంతో తప్పులను సరిదిద్ది, పథకాల అమలుకు సంబంధించిన చట్టపరమైన ప్రాతిపదిక, ఆర్థిక వివరాలు, నిధుల కేటాయింపులు, ఇప్పటివరకు చేసిన వ్యయం తదితర అంశాలను సమగ్రంగా పొందుపరుస్తూ కొత్త కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఆ తర్వాతే తదుపరి వాదనలు వింటామని స్పష్టం చేసింది.

**పూర్తి వాదనల తర్వాతే నిర్ణయం**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై ఉన్న మధ్యంతర నిలుపుదల ఉత్తర్వులను ఎత్తివేయాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోరారు. అయితే పూర్తి వాదనలు విన్న తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటామని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.ఉచిత పథకాల అమలు, ప్రభుత్వ ఆర్థిక స్థితి, ప్రజాధనం వినియోగం, సంక్షేమ పథకాలకు చట్టపరమైన ఆధారం వంటి అంశాలపై హైకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర ఆర్థిక విధానాలపై మరోసారి విస్తృత చర్చకు దారితీశాయి.

## అమృత్ భారత్ స్టేషన్ల పనులు వేగవంతం చేయాలి

**సికింద్రాబాద్, మహా :** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని పార్లమెంట్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులను కోరారు. కొత్త రైళ్లను ప్రవేశపెట్టడంతో పాటు ప్రస్తుతం నడుస్తున్న రైళ్లకు అదనపు నిలుపుదలలు కల్పించాలని, అవసరమైన మార్గాల్లో రైళ్లను పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దక్షిణ మధ్య రైల్వే పరిధి పార్లమెంట్ సభ్యులతో సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమన్వయ సమావేశం జరిగింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు 15 మంది పార్లమెంట్ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. రైల్వే ప్రాజెక్టుల పురోగతి, ప్రయాణికుల సౌకర్యాలు, కొత్త రైలు మార్గాలు, రహదారి పైవంతెనలు, కింది వంతెనలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

**కొత్త రైళ్లు.. అదనపు నిలుపుదలలు**

ప్రాంతాల వారీగా ప్రయాణికుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీలు కోరారు. ఇప్పటికే నడుస్తున్న రైళ్లకు అవసరమైన ప్రాంతాల్లో అదనపు నిలుపుదలలు కల్పించాలని, మరికొన్ని రైళ్లను పొడిగించాలని సూచించారు.

# 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టు ఊరట

**ఢిల్లీ, మహా:** 37 ఏళ్ల నాటి హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన 105 ఏళ్ల రసిక్ చంద్ర మొండల్‌కు సుప్రీంకోర్టు భారీ ఊరట కల్పించింది. వయసు, సుదీర్ఘ న్యాయపోరాటాన్ని పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఆయనకు విధించిన జీవిత ఖైదులో మిగిలిన శిక్షను రద్దు చేసింది. దీంతో మొండల్‌కు జీవిత ఖైదు నుంచి విముక్తి లభించింది.

# నా టార్గెట్ కాంగ్రెస్ కాదు.. రేవంత్ రెడ్డి

- మరోసారి కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు
- కాంగ్రెస్ అన్నా, ఆ పార్టీ నేతలన్నా తనకు అభిమానమని వ్యాఖ్య
- సీఎం కుటుంబసభ్యులపై అవినీతి ఆరోపణలున్నాయని వెల్లడి
- సీఎం సోదరుడి కంపనీకి రూ. 200 కోట్ల భూమిని కట్టబెట్టారని ఆరోపణ

**హైదరాబాద్, మహా :** సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన టార్గెట్ కాంగ్రెస్ పార్టీ కాదని పేర్కొన్న కొండా సుస్మిత.. రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబమేనని స్పష్టం చేశారు. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి కాంగ్రెస్ అగ్రనేతలంటే తనకు గౌరవం ఉందని తెలిపారు. సీఎం కుటుంబ అవినీతి ఆరోపణలను బయటపెడతానని మరోసారి హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై గతంలో చేసిన వ్యాఖ్యలకు తాజాగా మరోసారి వివరణ ఇచ్చిన కొండా సుస్మిత .. తన టార్గెట్ కాంగ్రెస్ కాదని.. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన ఫ్యామిలీ మాత్రమేనని తేల్చి చెప్పారు. దీంతో ఈ వ్యవహారంలో ఇప్పటికే వేడెక్కిన తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు మరింత రసవత్తరంగా మారాయి. కాంగ్రెస్ అగ్రనేతలపై తనకు గౌరవం ఉందని పేర్కొన్న కొండా సుస్మిత.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌లను తాను గౌరవిస్తానని పేర్కొన్నారు. తాను కాంగ్రెస్‌ను విమర్శించలేదని.. కేవలం సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబంపై మాత్రమే ప్రశ్నలు లేవనెత్తానని తెలిపారు.తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన కొండా సుస్మిత.. కాంగ్రెస్ పార్టీపై తనకు ఎలాంటి వ్యతిరేకత లేదని తేల్చిచెప్పారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులపై అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయని.. వాటినే తాను ప్రశ్నిస్తున్నానని పేర్కొన్నారు. తనపై కౌంటర్ వ్యాఖ్యలు చేయడానికి ప్రయత్నిస్తే మరిన్ని అంశాలను బయటపెడతానని తీవ్ర హెచ్చరికలు చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల సీటు రేవూరి ప్రకాష్ రెడ్డికే అని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై కొండా సుస్మిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తాను పోటీ చేయడం ఖాయమని ప్రకటించారు.ఎన్నికల్లో అభ్యర్థులను నిర్ణయించేందుకు పార్టీ హైకమాండ్ ఉన్నప్పుడు.. ముఖ్యమంత్రి ఒక్కరే 2 ఏళ్ల ముందుగానే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని కొండా సుస్మిత ప్రశ్నించారు. అవసరమైతే పరకాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కూడా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడికి చెందిన ఒక కంపెనీకి సుమారు రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారంటూ కొండా సుస్మిత మరోసారి సంచలన ఆరోపణలకు తెరతీశారు. ఈ అంశంతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన మరిన్ని అవినీతి, అక్రమాలను బయటపెడతానని ఆమె చేసిన హెచ్చరికలు సంచలనం రేపుతున్నాయి. మరోవైపు.. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన రద్దు వ్యవహారం కూడా ఈ వివాదం మధ్య తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమెరికా పర్యటనకు కేంద్ర విదేశాంగ శాఖ రాజకీయ అనుమతి నిరాకరించడంతో ఆగస్ట్ 23వ తేదీన రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు తిరిగి రానున్నట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి తిరిగి వచ్చిన తర్వాత కొండా సురేఖ, కొండా సుస్మిత వ్యవహారంపై పార్టీ పరంగా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది.

## వెండితెర 'షావుకారు' జానకి ఇకలేరు.

**హైదరాబాద్, మహా :** భారతీయ చిత్రసీమలో తనదైన విలక్షణ నటనతో చెరగని ముద్ర వేసిన ప్రముఖ సీనియర్ నటి 'షావుకారు' జానకి ఇకలేరు. 94 ఏళ్ల వయసులో చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె కన్నుమూశారు. ఏడు దశాబ్దాలకు పైగా సాగిన సినీ ప్రస్థానంలో దాదాపు 400 చిత్రాల్లో నటించిన జానకి.. కథానాయికగా, సహాయ నటిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా విభిన్న పాత్రల్లో ప్రేక్షకులను మెప్పించారు. ఆమె మృతి తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

**తొలి చిత్రంతోనే ఇంటిపేరుగా 'షావుకారు'**

1931 డిసెంబరు 12న రాజమండ్రిలో శంకరమంచి వెంకోజీరావు, శచీదేవి దంపతులకు జానకి జన్మించారు. చిన్ననాటి నుంచే కళలపై ఆసక్తి పెంచుకున్న ఆమె 11 ఏళ్ల వయసులోనే రేడియో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత సినిమాల్లోకి ప్రవేశించి అంచెలంచెలుగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.1949లో 'రక్షరేఖ' చిత్రంతో వెండితెరకు పరిచయమైనా.. 1950లో ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కిన 'షావుకారు' చిత్రం ఆమె సినీ జీవితాన్ని మలుపుతిప్పింది. అందులో 'సుబ్బులు' పాత్రలో ఆమె చూపిన సహజ నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆ సినిమా పేరే ఆమెకు శాశ్వతంగా ఇంటిపేరుగా మారింది. అదే సమయంలో నందమూరి తారకరామారావు కథానాయకుడిగా, జానకి కథానాయికగా చేసిన తొలి చిత్రం కూడా ఇదే కావడం విశేషం.

**ఐదు భాషల్లో.. వందలాది పాత్రల్లో**

తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో కలిపి దాదాపు 385కి పైగా చిత్రాల్లో నటించిన జానకి.. 200కు పైగా సినిమాల్లో కథానాయికగా కనిపించారు. ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వరరావు, ఎంజీఆర్, శివాజీ గణేశన్, డాక్టర్ రాజ్‌కుమార్ వంటి అగ్ర కథానాయకులతో కలిసి నటించి తన ప్రత్యేకతను చాటుకున్నారు.నటిగా ఆమె ప్రస్థానంలో మరో అరుదైన ఘనత కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత, కరుణానిధిలతో కలిసి నటించిన కథానాయికగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

**కథానాయిక నుంచి క్యారెక్టర్ నటిగా..**

1970ల మధ్యకాలం తర్వాత కథానాయిక పాత్రలకు దూరమై సహాయ, కీలక పాత్రల్లో రాణించారు. వయసుకు తగిన పాత్రలను ఎంచుకుంటూనే తన నటనా వైవిధ్యాన్ని కొనసాగించారు. 'సంసారం ఒక చదరంగం' చిత్రంలోని చిలకమ్మ పాత్ర ఆమెకు విశేష ప్రశంసలు తెచ్చిపెట్టింది. ఈ చిత్రానికి గాను ఆమె నంది పురస్కారాన్ని అందుకున్నారు.'రోజులు మారాయి', 'మంచి మనసులు', 'డాక్టర్ చక్రవర్తి', 'గీతాంజలి', 'తాయారమ్మ బంగారమ్మ' తదితర చిత్రాల్లో ఆమె పోషించిన పాత్రలు ప్రేక్షకుల జ్ఞాపకాల్లో నిలిచిపోయాయి. వయసు పెరిగినా నటనకు దూరం కాకుండా చివరి దశ వరకు సినిమాల్లో కొనసాగారు. 2023లో విడుదలైన 'అన్నీ మంచి శకునములే' ఆమె చివరి చిత్రంగా నిలిచింది.

**పద్మశ్రీతో సహా ఎన్నో గౌరవాలు**

సినీ రంగానికి ఆమె చేసిన విశిష్ట సేవలకు అనేక పురస్కారాలు, సత్కారాలు లభించాయి. అరిజోనా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం 2022లో ఆమెను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.నటిగానే కాకుండా రేడియో వ్యాఖ్యాతగా, వ్యాపారవేత్తగా కూడా ఆమె తన ప్రతిభను చాటుకున్నారు. బహుముఖ ప్రజ్ఞతో తెలుగు, తమిళ చిత్రసీమల్లో తనకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్నారు.

**కళామతల్లి ఒడిలో శాశ్వతంగా..**

'షావుకారు' జానకి ప్రయాణం ఒక సాధారణ నటి ప్రస్థానం కాదు. కథానాయికగా వెలుగొందిన కాలం నుంచి తల్లిగా, అత్తగా, పెద్దమనిషిగా, భావోద్వేగభరితమైన పాత్రల్లో జీవించిన దశ వరకు.. ప్రతి తరంతోనూ ఆమెకు అనుబంధం ఏర్పడింది. తెరపై ఆమె పలికించిన సంభాషణలు, పండించిన హాస్యం, ఆవిష్కరించిన భావోద్వేగాలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి. తెరపై 'షావుకారు'గా మొదలైన ఆ ప్రస్థానం.. పద్మశ్రీతో శిఖరాన్ని చేరి.. ఇప్పుడు జ్ఞాపకాల వెండితెరపై శాశ్వతంగా నిలిచిపోయింది

# కత్తిపూడిలో కల్తీ కాటు

- ప్రాణాలతో యథేచ్ఛగా చెలగాటం.
- పొద్దుతిరుగుడు నూనె ముసుగులో విడి నూనె.
- పల్లెలపై విషం చిమ్ముతున్న అక్రమార్కులు.
- మన్యవాసులే లక్ష్యంగా నకిలీ దందా.
- తుప్పు పట్టిన పీపాల్లో వంటనూనె.
- నిద్రమత్తులో ఆహార భద్రతా అధికారులు.



**కాకినాడ, మహా:** పచ్చని పల్లెల్లో కల్తీ భూతం పడగవిప్పుతోంది. అమాయక ప్రజల ఆరోగ్యమే పెట్టుబడిగా, అక్రమార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు పేట్రేగిపోతున్నారు. నాణ్యత లేని, అపరిశుభ్రమైన నూనెలను ప్రముఖ సంస్థల పేర్లతో విక్రయిస్తూ నిలువునా మోసం చేస్తున్నారు. కాకినాడ జిల్లా కత్తిపూడి కేంద్రంగా సాగుతున్న ఈ నకిలీ విడి నూనెల దందా ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది. అధికారుల కళ్లుగప్పి పగటిపూటే రహదారి పక్కన డబ్బాల్లో నింపుతూ, మన్యపు ప్రాంతాలకు ఈ విషాన్ని సరఫరా చేస్తున్న ముఠా ఆగడాలు ఎట్టకేలకు వెలుగులోకి వచ్చాయి. ఈ కల్తీ దందా వెనుక ఉన్న అదృశ్య శక్తులు ఎవరు? అధికారుల పర్యవేక్షణ ఏమైంది? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**కత్తిపూడి కేంద్రంగా కల్తీ సామ్రాజ్యం.**

కాకినాడ జిల్లా కత్తిపూడి గ్రామంలోని శంఖవరం రహదారిపై ఉన్న ఆకాశ వంతెన వద్ద ప్రముఖ సమాచార సంస్థ కార్యాలయం పక్కన ఒక ప్రైవేటు వాణిజ్య సంస్థ ముసుగులో అనధికారిక కల్తీ సామ్రాజ్యం నడుస్తోంది. ఎలాంటి అనుమతులు, కనీస పరిశుభ్రత లేకుండా పగటిపూటే బహిరంగంగా విడి నూనెను డబ్బాల్లో నింపే దందా సాగుతోంది. గుర్తుతెలియని సరుకు రవాణా వాహనాల్లో రాత్రికి రాత్రే వచ్చే ఈ నాసిరకం నూనెను.. ఉదయం కాగానే పాత సీసాలు, పదిహేను కొలతల తుప్పు పట్టిన ఇనుప డబ్బాల్లో నింపుతూ.. ప్రముఖ సంస్థల నూనెగా మార్చేస్తున్నారు. ఈ నూనె ఏ కర్మాగారం నుంచి వస్తోంది, వాడి పారేసిన వ్యర్థ నూనెల ముఠాలతో వీరికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

**పొద్దుతిరుగుడు నూనె ముసుగులో నాసిరకం నూనె విక్రయాలు.**

ఈ అక్రమ వ్యాపారులు ప్రజల కళ్లకు గంతలు కడుతున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. డబ్బాలపై ఒక ప్రముఖ పేరుతో ఉన్న పేరుచీటీని అంటించి, లోపల మాత్రం అత్యంత నాసిరకమైన తాటి నూనె జాతికి చెందిన వంటనూనెను నింపుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, దీనిని నాణ్యమైన పొద్దుతిరుగుడు నూనెగా నమ్మిస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని చిరు వ్యాపారులకు అంటగడుతున్నారు. తక్కువ ధరకే వస్తుండటంతో భోజనశాలలు, చిరుతిళ్ల దుకాణాలు, మిరపకాయ బజ్జీల బండ్ల నిర్వాహకులు ఈ నూనెను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా ఈ నూనెతో చేసిన పదార్థాలను తింటున్న సామాన్య ప్రజలు ప్రాణాంతక రోగాల బారిన పడుతున్నారు.

**మన్యవాసులే లక్ష్యంగా విష ప్రయోగం.**

కత్తిపూడిలో సిద్ధమవుతున్న ఈ కల్తీ నూనె కేవలం స్థానికంగానే కాకుండా, గుట్టుచప్పుడు కాకుండా మన్యపు ప్రాంతాలకు తరలిపోతోంది. రౌతులపూడి మరియు దాని పరిసర గిరిజన, మారుమూల గ్రామీణ ప్రాంతాలే లక్ష్యంగా ఈ ముఠా పావులు కదుపుతోంది. అక్కడ ఉండే అమాయక ప్రజలకు, చిరు వ్యాపారులకు మాయమాటలు చెప్పి ఈ కల్తీ నూనెను విక్రయిస్తున్నారు. ఇటువంటి వ్యర్థ మరియు కల్తీ నూనెలను వాడటం వల్ల కాలేయ, గుండె సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

**నిబంధనలు గాలికి.. అధికారుల పర్యవేక్షణ ఏది?**

భారతదేశ ఆహార భద్రతా ప్రమాణాల చట్టం ప్రకారం విడిగా అమ్మే వంటనూనెను ఇలా బహిరంగంగా డబ్బాల్లో నింపి విక్రయించడం చట్టరీత్యా నేరం. డబ్బాలపై ధర, గుర్తింపు సంఖ్య, తయారీ తేదీ వంటివి యంత్రాల ద్వారా ముద్రించి ఉండాలి. కానీ, ఇక్కడ విక్రయిస్తున్న డబ్బాలపై ఏకంగా కలాంతో చేతిరాతతో పద్నాలుగు కొలతల పరిమాణం అని రాసి ఉండటం వీరి బరితెగింపునకు అద్దం పడుతోంది. ముమ్మాటికీ ఇది ఆహార భద్రతా చట్టాల ఉల్లంఘనే అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**కఠిన చర్యలు తీసుకోవాల్సిందే!**

ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి, కాసుల కక్కుర్తితో వ్యాపారం చేస్తున్న ఇటువంటి నకిలీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని స్థానికులు, సామాజిక విశ్లేషకులు గట్టిగా కోరుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆహార భద్రతా అధికారుల ప్రత్యేక బృందాలతో కత్తిపూడిలోని సదరు కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించాలి. అక్కడ సిద్ధం చేస్తున్న నూనె నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపాలి. కల్తీ అని తేలితే కేవలం జరిమానాలు విధించి చేతులు దులుపుకోకుండా, బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చట్టాల కింద నేర నమోదు చేసి కారాగారానికి పంపాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇప్పుడైనా అధికారులు మేల్కొంటారో లేక కల్తీ దందాకు వత్తాసు పలుకుతారో వేచి చూడాలి!

# అమృత్ భారత్ స్టేషన్ల పనులు వేగవంతం చేయాలి

- కొత్త రైళ్లు.. అదనపు నిలుపుదలలు.
- రైల్వే ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయాలి
- ఎంపీల డిమాండ్

సికింద్రాబాద్, మహా : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని పార్లమెంట్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులను కోరారు. కొత్త రైళ్లను ప్రవేశపెట్టడంతో పాటు ప్రస్తుతం నడుస్తున్న రైళ్లకు అదనపు నిలుపుదలలు కల్పించాలని, అవసరమైన మార్గాల్లో రైళ్లను పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దక్షిణ మధ్య రైల్వే పరిధి పార్లమెంట్ సభ్యులతో సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమన్వయ సమావేశం జరిగింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు 15 మంది పార్లమెంట్ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. రైల్వే ప్రాజెక్టుల పురోగతి, ప్రయాణికుల సౌకర్యాలు, కొత్త రైలు మార్గాలు, రహదారి పైవంతెనలు, కింది వంతెనలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

**కొత్త రైళ్లు.. అదనపు నిలుపుదలలు**

ప్రాంతాల వారీగా ప్రయాణికుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీలు కోరారు. ఇప్పటికే నడుస్తున్న రైళ్లకు అవసరమైన ప్రాంతాల్లో అదనపు నిలుపుదలలు కల్పించాలని, మరికొన్ని రైళ్లను పొడిగించాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

కొత్త రైల్వే మార్గాల నిర్మాణం, మార్గాల విస్తరణ, రహదారి పైవంతెనలు, కింది వంతెనల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న జాప్యాన్ని తొలగించాలని ఎంపీలు కోరారు. ముఖ్యంగా కొవిడ్ అనంతరం నిలిచిపోయిన పనులను తిరిగి వేగవంతం చేయాలని సూచించారు.

**కాజీపేటలో రైల్వే డివిజన్‌కు డిమాండ్**

కాజీపేటలో ప్రత్యేక రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని అన్ని పార్టీల ఎంపీలు కలిసి కోరినట్లు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

మహబూబ్‌నగర్ ప్రాంతంలో కొత్త రైల్వే మార్గాల నిర్మాణానికి సంబంధించిన అంశాలను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బీజేపీ ఎంపీ డీకే అరుణ తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపాదిత వేగవంతమైన రైలు మార్గాలపై వస్తున్న ప్రచారాన్ని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ రఘునందన్‌రావు చెప్పారు.ఈదుల నాగులపల్లి ప్రాంతంలో టెర్మినల్, రైల్వే అనుసంధానం, కొత్త రైలు మార్గాలను అభివృద్ధి చేయాలని కూడా ఆయన కోరారు.

**భద్రాచలానికి నేరుగా రైలు మార్గం**

భద్రాచలానికి ఇప్పటికీ సరైన రైల్వే అనుసంధానం లేకపోవడంపై ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. వందేళ్ల చరిత్ర ఉన్న భద్రాచలానికి కొత్తగూడెం మార్గంలో ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్ పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూర్చడం లేదన్నారు. పాండురంగాపురం నుంచి భద్రాచలానికి రైల్వే అనుసంధానం కల్పించాలని, గాజులమడుగు నుంచి నేరుగా రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. భద్రాచలంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తే ఐదు రాష్ట్రాలకు రవాణా అనుసంధానం మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని ఆదివాసీలు, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు కూడా రైల్వే మార్గం ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు.

**రూ.24,210 కోట్లతో పనులు**

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ.24,210.179 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 1,481 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే మార్గాలు, మార్గాల రెట్టింపు, మూడింతలు చేసే పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ తెలిపారు.

స్టేషన్ల అభివృద్ధి, రైళ్లలో పరిశుభ్రత, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల తదితర అంశాలపై ఎంపీలకు ఆయన వివరించారు. సమావేశంలో ఎంపీలు ప్రస్తావించిన సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైల్వే మౌలిక వసతుల విస్తరణతో పాటు పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైళ్ల సంఖ్య, నిలుపుదలలు, అనుసంధాన మార్గాలను పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎంపీలు స్పష్టం చేశారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శనివారం, హైదరాబాద్ | 22-08-2026




# ప్రకృతి ఒడిలో నికితా శర్మ అందాల సందడి

ప్రకృతి అందాల నడుమ నటి నికితా శర్మ ఆకట్టుకునే లుక్‌లో కనిపించారు. పచ్చదనంతో నిండిన ప్రదేశంలో చెక్క రైలింగ్‌పై కూర్చొని వెనక్కి తిరిగి చూస్తున్న ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పచ్చని పూల చీర, బ్యాక్‌లెస్ బ్లౌజ్‌లో కనిపించిన నికితా శర్మ సంప్రదాయ అందానికి గ్లామర్ టచ్ జోడించారు. ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా కూర్చొని, తనదైన స్టైల్‌లో పోజులిచ్చిన ఈ ఫొటోలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రకృతిలో మమేకమైనట్టుగా కనిపిస్తున్న ఈ అందమైన క్షణాలను ఆమె అభిమానులతో పంచుకున్నారు.నికితా శర్మ ప్రధానంగా టెలివిజన్ నటిగా మంచి గుర్తింపు పొందారు. 2013లో 'ఏ ది సీరియల్'లో తానీ పాత్రతో నటనా ప్రయాణాన్ని రంభించారు. అదే ఏడాది 'దో దిల్ ఏక్ జాన్'లో అంతర కౌల్ పాత్రలో నటించి మరింత గుర్తింపు సంపాదించారు. ఆ తర్వాత 'స్వరాగిణి–జోడే రిష్తోం కే సుర్'లో కవితా రాయ్, 'మహాకాళి–అంత్ హీ ఆరంభ్ హై'లో లక్ష్మీదేవి పాత్రల్లోv నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 'ఫిర్ లౌట్ ఆయీ నాగిన్'లో నందిని, శివాని పాత్రల్లోనూ మెప్పించారు.

టెలివిజన్‌లో వరుస అవకాశాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నికితా శర్మ ఇటీవలి కాలంలో సినిమాలపైనా దృష్టి సారించారు. 2024లో విడుదలైన గుజరాతీ థ్రిల్లర్ '31st Movie'లో నటించారు. 2025లో వచ్చిన హారర్ కామెడీ 'ఓయే భూత్నీ కే'లోనూ కనిపించారు. ప్రస్తుతం 'షైతానీ రస్మేన్' వంటి సూపర్‌నేచురల్ సిరీస్‌తో పాటు 2026లో రానున్న 'అండర్‌కవర్ బాస్ లేడీ', 'మేరీ సాంకీ దుల్హనియా' వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. టెలివిజన్‌తో పాటు సినిమాల్లోనూ తన కెరీర్‌ను విస్తరిస్తున్న నికితా శర్మ.. విభిన్నమైన పాత్రలు, గ్లామరస్ లుక్స్‌తో అభిమానులను అలరిస్తున్నారు. తెరపై నటనతో మెప్పిస్తూనే సోషల్ మీడియాలో తన స్టైలిష్ ఫొటోలతోనూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.

# అక్టోబర్‌లో 'వారణాసి' షూటింగ్ పూర్తి?

మహేష్ బాబు, ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. అనౌన్స్‌మెంట్ నుంచే అంచనాలు పెంచుకున్న ఈ ప్రాజెక్ట్‌ను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ తరహా విజువల్స్, యాక్షన్, అడ్వెంచర్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులకు అందించేందుకు చిత్రబృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం.ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్న ఈ సినిమాను అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని రాజమౌళి లక్ష్యంగా పెట్టుకున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. షూటింగ్‌ను ముందుగానే ముగించి, పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక పనులకు ఎక్కువ సమయం కేటాయించేలా ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. రాజమౌళి సినిమాల్లో విజువల్ క్వాలిటీ, సాంకేతిక నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అందుకే 'వారణాసి' విషయంలోనూ ప్రతి పనిని పక్కా షెడ్యూల్‌తో పూర్తి చేయాలని టీమ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికే 'వారణాసి' చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడం, మహేష్ బాబు తొలిసారి ఆయనతో కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. అంతర్జాతీయ అడ్వెంచర్ నేపథ్యంలో సాగే కథలో మహేష్ బాబు సరికొత్త గెటప్‌లో కనిపించనున్నట్లు సమాచారం. భారీ యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం మహేష్ బాబు స్టార్‌డమ్‌కు రాజమౌళి బ్రాండ్‌ను జోడించడంతో బాక్సాఫీస్‌పై భారీ ప్రభావం చూపుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




# సినిమా చూసి సందీప్ బీర్ ఓపెన్ చేశాడు

సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'రోమాంచకం' సినిమా ప్రమోషన్స్‌లో నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా ఆసక్తికర విషయాలను వెల్లడించారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రానికి వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహించగా, సందీప్ రెడ్డి వంగా సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. తాజాగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సినిమా నిర్మాణం, దర్శకుడి కష్టం, ఫస్ట్ కాపీ చూసిన తర్వాత సందీప్ రెడ్డి వంగా స్పందన గురించి నిర్మాత మాట్లాడారు.దాదాపు 15 నెలల క్రితం దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి ఈ కథను తనకు చెప్పారని ప్రణయ్ తెలిపారు. కథ చెప్పే సమయంలో దర్శకుడు అన్ని పాత్రలను స్వయంగా నటించి చూపించడంతో కథపై ఆసక్తి కలిగి వెంటనే సినిమా చేయడానికి అంగీకరించినట్లు చెప్పారు. నటీనటులకు సుమారు మూడు నెలల పాటు రిహార్సల్స్ నిర్వహించిన తర్వాత షూటింగ్ ప్రారంభించామని వెల్లడించారు. సినిమా ఫస్ట్ కాపీ చూసినప్పుడు చాలా కొత్తగా, ఫ్రెష్‌గా అనిపించిందని ఆయన పేర్కొన్నారు.షూటింగ్ సమయంలో ఎదురైన అనుభవాలను కూడా ప్రణయ్ పంచుకున్నారు. చెన్నై సముద్ర తీర ప్రాంతంలో ఎండల్లో దాదాపు పది రోజుల పాటు షూటింగ్ నిర్వహించినట్లు చెప్పారు. తాను ఇతర పనుల్లో బిజీగా ఉండటంతో ఆ షెడ్యూల్‌కు వెళ్లలేకపోయానని, షూటింగ్ పూర్తయ్యాక దర్శకుడిని చూసి గుర్తుపట్టలేనంతగా ఎండకు మారిపోయారని సరదాగా వ్యాఖ్యానించారు.సినిమా బడ్జెట్ విషయంలో దర్శకుడు ఎంతో క్రమశిక్షణగా వ్యవహరించారని నిర్మాత ప్రశంసించారు. మొదటి రోజు పేపర్‌పై నిర్ణయించిన బడ్జెట్‌లోనే సినిమాను పూర్తి చేశారని తెలిపారు. క్లిష్టమైన లొకేషన్లలో సినిమాటోగ్రాఫర్ పవన్ అద్భుతమైన విజువల్స్ అందించారని టెక్నికల్ టీమ్‌ను అభినందించారు.ఇక 'రోమాంచకం' ఫస్ట్ కట్ చూసిన తర్వాత సందీప్ రెడ్డి వంగా స్పందన గురించి అడిగినప్పుడు ప్రణయ్ ఆసక్తికర విషయాన్ని చెప్పారు. సినిమా చూసి సందీప్ చాలా సంతోషించారని, ప్రిలిమినరీ కట్ చూసిన అనంతరం తనకు స్వయంగా బీర్ ఓపెన్ చేసి ఇచ్చారని నవ్వుతూ వెల్లడించారు.అదే కార్యక్రమంలో తన జీవితంలో అత్యంత రోమాంచకమైన క్షణం ఏదని అడిగిన ప్రశ్నకు కూడా ప్రణయ్ సరదాగా సమాధానమిచ్చారు. తన తల్లి చూపించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడమే తన జీవితంలో అలాంటి సందర్భమని చెప్పారు.సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్‌కుమార్ జంటగా నటించిన ఈ సినిమాకు విడుదల పరంగానూ మంచి సపోర్ట్ లభించినట్లు నిర్మాత తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలో సునీల్ నారంగ్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారని చెప్పారు. సెప్టెంబర్ 3న థియేటర్లలోకి రానున్న 'రోమాంచకం' ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందనే నమ్మకాన్ని ప్రణయ్ వ్యక్తం చేశారు.



# 'ఫౌజీ'లో రెండు భారీ యాక్షన్ బ్లాక్స్?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సినిమా షూటింగ్‌కు సంబంధించిన కొన్ని దృశ్యాలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ముఖ్యంగా సినిమాలో ఉండబోయే రెండు కీలక యాక్షన్ సన్నివేశాలపై ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 'ఫౌజీ'లో భారీ అండర్‌వాటర్ యాక్షన్ సీక్వెన్స్‌ను రూపొందించినట్లు సమాచారం. ఈ సన్నివేశం కోసం దాదాపు 20 రోజుల పాటు ప్రత్యేకంగా చిత్రీకరణ నిర్వహించినట్లు తెలుస్తోంది. సినిమాకు ఈ యాక్షన్ బ్లాక్ ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశం ఉందని టాక్. మరోవైపు నరసింహస్వామి నేపథ్యాన్ని ఆధారంగా చేసుకుని మరో భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను రూపొందించినట్లు సమాచారం. ఈ సన్నివేశంలో ప్రభాస్ యాక్షన్‌తో పాటు భావోద్వేగాలను కూడా చూపించనున్నారని తెలుస్తోంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ ఫైట్‌కు ముగ్గురు ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్లు పనిచేసినట్లు సమాచారం.సినిమా ద్వితీయార్థంలో ఈ రెండు యాక్షన్ ఎపిసోడ్లు కీలకంగా ఉండనున్నాయని తెలుస్తోంది. యాక్షన్, ఎమోషన్, విజువల్ ఎఫెక్ట్స్ కలయికతో వీటిని ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని కలిగించేలా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ప్రభాస్‌కు సంబంధించిన ఓ వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో ఆయన ఎరుపు రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్‌లో ఫార్మల్ లుక్‌లో కనిపిస్తున్నారు. 'మిర్చి' తర్వాత ప్రభాస్‌ను ఇలాంటి లుక్‌లో చూడటం అరుదుగా ఉండటంతో అభిమానులు ఈ వీడియోపై ఆసక్తి చూపిస్తున్నారు.పీరియాడిక్ కథాంశం, హను రాఘవపూడి దర్శకత్వ శైలి, ప్రభాస్ స్టార్‌డమ్‌కు భారీ యాక్షన్ అంశాలు తోడవడంతో 'ఫౌజీ'పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇమాన్వి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని 2026 డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



# చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్.. మమిత దారెటు?

'ప్రేమలు' సినిమాతో ఒక్కసారిగా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మమిత బైజు ఇప్పుడు వరుస అవకాశాలతో బిజీగా మారుతోంది. రీను పాత్రలో తన సహజమైన నటన, యూత్‌ఫుల్ లుక్‌తో ఆకట్టుకున్న ఈ మలయాళ భామకు ఆ సినిమా తర్వాత తెలుగుతో పాటు తమిళంలోనూ మంచి క్రేజ్ వచ్చింది. తాజాగా సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో నటించడంతో స్టార్ హీరోల సినిమాల్లో మమిత ఎలా కనిపిస్తుందనే ఆసక్తి కూడా పెరిగింది.'ప్రేమలు' తర్వాత ప్రదీప్ రంగనాథన్‌తో 'డ్యూడ్', విజయ్ నటించిన 'జన నాయకన్', ధనుష్‌కు సంబంధించిన 'కారా' వంటి ప్రాజెక్టులతో తమిళ ప్రేక్షకులకు కూడా పరిచయమైంది. వరుసగా పెద్ద హీరోల సినిమాల్లో కనిపిస్తుండటంతో మమిత కెరీర్ ఇప్పుడు మరో దశలోకి అడుగుపెడుతోందనే చర్చ మొదలైంది. ప్రస్తుతం ప్రభాస్, అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి పాన్ ఇండియా స్టార్ల సినిమాల్లో హీరోయిన్ ఎంపిక కూడా ఆసక్తికరంగా మారుతోంది. రష్మిక, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, త్రిప్తి డిమ్రి వంటి హీరోయిన్లు పెద్ద ప్రాజెక్టుల్లో భాగమవుతున్న నేపథ్యంలో మమిత పేరు కూడా అలాంటి జాబితాలో చేరుతుందా అన్న ఆసక్తి నెలకొంది.అయితే మమిత ఇప్పటివరకు ఎక్కువగా సహజత్వానికి దగ్గరగా ఉండే ప్రేమకథలు, యూత్‌ఫుల్ పాత్రల్లోనే కనిపించింది. భారీ యాక్షన్ సినిమా, పెద్ద స్టార్ హీరో సరసన గ్లామర్‌తో కూడిన పాత్రలో ఆమెను ప్రేక్షకులు ఇంకా పూర్తిస్థాయిలో చూడలేదు. అందుకే అలాంటి భారీ ప్రాజెక్ట్ ఆమె కెరీర్‌కు కీలకంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆమెకు ఉన్న ఫ్రెష్ ఫేస్ ఇమేజ్ కూడా అదనపు బలంగా మారొచ్చు.మమితను కేవలం మలయాళ హీరోయిన్‌గా పరిమితం చేయలేని పరిస్థితి ప్రస్తుతం కనిపిస్తోంది. 'ప్రేమలు'తో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. తమిళంలోనూ విజయ్, ధనుష్, సూర్య వంటి స్టార్ హీరోల ప్రాజెక్టులతో ప్రేక్షకులకు పరిచయమైంది. దీంతో కొత్త పాన్ ఇండియా సినిమాలో ఆమెను ఎంపిక చేస్తే ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం తక్కువగా ఉంటుంది.ఇక మమిత తదుపరి అడుగు ఏ దిశలో ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. మరో చిన్న ప్రేమకథను ఎంచుకుంటుందా? లేక నేరుగా ఓ పాన్ ఇండియా స్టార్ సరసన భారీ చిత్రంలో కనిపిస్తుందా? అన్నది చూడాలి. ప్రస్తుత క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుంటే ప్రభాస్, ఎన్టీఆర్, రామ్ చరణ్ లేదా అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోల సరసన అవకాశం వస్తే మమిత కెరీర్ మరింత వేగంగా ముందుకు వెళ్లే అవకాశం ఉందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034